# ఆత్మతత్త్వమును గుర్తించటమే ఆధ్యాత్మికము

**నిర్గుణో నిష్క్రియో నిత్యో నిర్వికల్పో నిరంజనః**
**నిర్వికారో నిరాకారో నిత్యముక్తో నిర్మలః.**

ప్రేమస్వరూపులారా!

భగవంతుడు గుణాతీతుడు, కారణరహితుడు. సాకారవికారములు లేనివాడు. సంకల్పవికల్పములకు అతీతుడు. నిత్యశుద్ధబుద్ధ బంధ రహితుడు.

**హరిమయము విశ్వమంతయు**
**హరి విశ్వమయుండు సంశయంబది లేదు**
**హరిమయము కాని ద్రవ్యము**
**పరమాణువు లేదు ఇలను పరికింపగన్.**

మనలోపల, వెలుపల సర్వత్ర గాలి ఉన్నది. కానీ, కంటికి కనుపించదు. చేతికి చిక్కదు. యింతమాత్రముచేత గాలి లేదని చెప్పవచ్చా? గాలియే లేకున్న తాను ఎలా ఉండగలిగాడు? గాలి లేదని చెప్పటము తాను లేనని చెప్పుకొనుటయే కదా! భగవంతుడు సర్వవ్యాపి. సర్వత్ర నిండినవాడు భగవంతుడు. దేశకాల పాత్రలకు అతీతుడు.

**మనస్సులేని స్థానము జగత్తులో కనిపించదు**

మనస్సు ఏఏ స్థానములలో పరిభ్రమించునో, ఆయా స్థానములంతా కూడను భగవంతుడున్నాడు. మనస్సులేని స్థానము జగత్తులో కనుపించదు. కనుకనే 'మనో మూలం మిదం జగత్' అన్నారు. జగత్తంతా మనోమయమైనది. మనోమయమైన యీ జగత్తునందు విశ్వత్వమనే స్వరూపమును ధరించి విష్ణుస్వరూపుడు సర్వవ్యాపియై ఉన్నాడు. ఈ చరాచర ప్రపంచమంతయుకూడను విష్ణుస్వరూపమే! విశ్వమును చూస్తూ విశ్వమును నేను

sri sathyasai vachanamrutam

చూడలేదనుకోటం మూర్ఖత్వము. అటులనే విశ్వస్వరూపుడైన విష్ణువును చూచుచూ భగవంతుని చూడలేదనుకోటం మూర్ఖత్వము కాదా! కనుకనే శృతులు 'పశ్యన్నపిచ న పశ్యతి మూఢో!' అన్నవి. 'ఓ మూఢుడా! విశ్వస్వరూపుడైన విష్ణువును చూచుచూ నేను భగవంతుని చూడలేదనుకోటం మూర్ఖత్వము కాదా?' అని ప్రశ్నించాయి. దీనికి కారణములు లేకపోలేదు. విశ్వమును విశ్వభావముతో చూచుచున్నాడు, మానవుడు; విష్ణుభావముతో చూడటం లేదు. భావములు మార్పు అయినప్పుడే బాహ్యము మార్పు అవుతుంది. భావముయొక్క reaction, reflection, resound బాహ్యము. Reflection of the inner being. లోపల ఉండిన ప్రభావమే బయట స్వభావముగా ఏర్పడుతుంది. కనుక, ప్రతి మానవుడు ప్రకృతి అనే భావమును త్యజించి పరమాత్మ అనే భావమును వరించినప్పుడే విష్ణుస్వరూపము అర్థమవుతుంది. ఒకటి త్యాగము, రెండవది స్వీకారము. త్యాగము చేసినప్పుడే మానవునకు శాంతి చేకూరుతుంది. రెండు భావములు ఉండినంతవరకు యితను జ్ఞాని అనిపించుకోలేడు. 'అద్వైతదర్శనం జ్ఞానం.' దీనికి ఆధారము, వైరాగ్యము. ఈ వైరాగ్యమే త్యాగము.

**జగత్తును త్యాగము చేయక ఈశ్వరత్వము అర్థము కాదు**

> **శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాత్ ధ్యానం విశిష్యతే,**
> **ధ్యానాత్కర్మఫలత్యాగస్త్యాగాచ్ఛాన్తి రనన్తరమ్.**

త్యాగము తరువాతనే శాంతి మనకు లభిస్తుంది. ఒకానొక సమయమున వ్యాసుల వారికి ఏకైక పుత్రుడైన శుకుడు, సర్వసంగపరిత్యాగియై ఇల్లు వదలి వెళ్ళుచున్నాడు. ఈ దృశ్యమును భరించుకొనలేక వ్యాసుడు శుకుని వెంటపడ్డాడు. 'నాయనా! నీవు ఇల్లు వదలకూడద'ని అనేక విధములుగా అతనిని ప్రాధేయపడినాడు. శుకుడు చెప్పాడు, 'నీవు తండ్రి కాదు. నేను కుమారుడను కాదు. యిరువురముకూడను ఆనందస్వరూపులమే! ఉపాధిభ్రాంతిచేత నీవు తండ్రివని నేను కుమారుడనని భావిస్తున్నావు. ఉపాధియే జగత్ స్వరూపము. జగత్ త్యాగము చేయక ఈశ్వరత్వము నీకు అర్థము కాదు. దృశ్యములు త్యజించక ద్రష్టలు కాలేరు. నీవు దృశ్య జగత్తునందు భ్రాంతిని పెంచుకున్నావు' అని



sri sathyasai vahini

బోధించాడు. ఈ పలుకులచే వ్యాసులవారి మనస్సు మార్పు చెంది తాను కూడను దివ్యమైన ఆనందస్వరూపునిగా విశ్వసిస్తూ వచ్చాడు. 'త్యాగము,' 'త్యాగము' అని చెపుతారు కదా, యిది సాధ్యమా? అని కొందరికి సందేహము కలుగుతుంది. కాని, సంకల్పించుకుంటే సాధ్యము కానిది లేదు. దురదృష్టవశాత్తు యీనాటి మానవుడు ఒక్క ఆశనే త్యజించలేకపోతున్నాడు. బీడి, సిగరెట్లనే త్యజించలేకపోతున్నాడు. టీ, కాఫీలను త్యజించలేకపోతున్నాడు. అభ్యాసముతో పెంచుకున్న యీ దురభ్యాసములను త్యజించలేని మానవుడు రాగద్వేషములను ఏ రీతిగా త్యజించగలడు?

**మానవుడు క్షణక్షణమునకు తన ప్రేమను మార్చుకొనుటచేత దుఃఖము ప్రాప్తిస్తున్నాది**

మానవుడు పరిపూర్ణ ప్రేమస్వరూపుడు. కానీ మానవునియొక్క ప్రేమ క్షణక్షణమునకు మారుతూ వస్తున్నది. పుట్టిన తక్షణమే తల్లియే ప్రాణమని భావించి తల్లడిల్లి విడలేక అనేక విధములుగా పరితపిస్తాడు. పెరుగుతూ పెరుగుతూ రాగా క్రమక్రమేణా బయట స్నేహితులకు కట్టుబడతాడు. తల్లి ఒడిని వదలి స్నేహితుల సంబంధము అభివృద్ధి గావించుకుంటాడు. ఈ మిత్రులే తన ప్రాణసమానులని భావిస్తాడు. ఇంతలో యవ్వనము ప్రవేశిస్తుంది. వివాహమాడతాడు. భార్యే ప్రాణమని విశ్వసించి మిత్రుని త్యజిస్తాడు. తన ప్రాణసమానముగా విశ్వసించిన భార్యను క్షణమైనా వదలలేక మిత్రుని త్యజిస్తాడు. ఒకరిద్దరు బిడ్డలు పుట్టగానే భార్యపై విసుగుపుడుతుంది. పిల్లలే ప్రాణ సమానముగా భావించి వారి విద్యాబుద్ధులు, అభివృద్ధికోసమని ధనమునంతా వ్యర్థము చేస్తాడు. కొంత కాలము గడచిన తరువాత తండ్రి, బిడ్డలకు అభిప్రాయ భేదము లేర్పడుతాయి. అప్పుడు తండ్రి ధనమునకు బ్రేకు వేస్తాడు. దానితో తండ్రీ కొడుకులకు ద్వేషము ఏర్పడుతుంది. తల్లితో ప్రారంభమైన యీ ప్రేమ ధనముతో అంత్యమవుతున్నాది. అప్పుడే దుఃఖమునకు గురౌతున్నాడు మానవుడు. ఈవిధంగా యీ ప్రేమాధారమును క్షణక్షణమునకు మార్చుటంచేత దుఃఖము ప్రాప్తిస్తున్నాది, మానవునకు. యిది సరైన ప్రేమ కాదు.

**క్షణములోపల పుట్టుచు క్షణములోనె**
**పెరుగునట్టిది ఎప్పుడు ప్రేమకాదు**

sri sathyasai vachanamrutam

**చావుపుట్టుక లేనట్టి జీవి హృదిని**
**నిత్యనిర్మల జ్యోతియై నెగడు ప్రేమ**

**అహంకార, మమకారములచేత ప్రేమ పెరుగుతూ, తరుగుతూ వస్తుంది**

నిజమైన ప్రేమ క్షణక్షణమునకు తరిగి పెరిగేది కాదు. పెరిగితరిగేటువంటిది అహంకార, మమకారములే! ఈ అహంకారమమకారములచేతనే ప్రేమ తరుగుతూ పెరుగుతూ వస్తున్నాది. కాన మానవుడు తన ప్రేమను జీవనజ్యోతిగా భావించాలి. మానవత్వము అత్యంత విలువైనది. మానవజీవితము అనుభవించ తగినది. మానవజన్మ ఆనందించతగినటువంటిది. మానవత్వములో ఉన్న విలువను విస్మరించి, ప్రాకృతమైన భోగభాగ్యములనాశించి, నిత్యసత్యమైన దివ్యత్వమును విస్మరిస్తున్నాడు, మానవుడు. ఒకానొక సమయమునందు జనక చక్రవర్తి యాజ్ఞవల్క్యుని చేరి 'గురూజీ! నా పూర్వజన్మ వృత్తాంతమును నేను వినగోరుచున్నాను దయచేసి నాకు తెలుపమ'ని ప్రార్థించాడు. అందుకు మహర్షి 'చక్రవర్తీ! గడచినది, గడచిపోయినది. దానిని స్మరించి ప్రయోజనమేమి? నడచివచ్చిన రోడ్డు చూచుకునే వచ్చావు. దీనిని నీవు చింతించవద్దు. యిది నీకు శ్రేయస్సుకాదు,' అని అనేక విధములుగా చెప్పినప్పటికిని గడచిన జీవితమును వినగోరుతూ అనేక విధములుగా ప్రార్థించాడు యాజ్ఞవల్క్యుని. యాజ్ఞవల్క్యుడు దివ్యదృష్టిచేత పరిశీలించి 'జనకా! యీ జన్మములో నీకు ధర్మపత్నిగా ఉండిన స్త్రీ గడచిన జన్మములో నీ తల్లియే' అన్నాడు. దీంతో జనక చక్రవర్తియొక్క మనస్సు మారిపోయింది. 'నేనెంతటి దుష్టుడను! ఈనాడు తల్లినే భార్యగా అనుభవిస్తున్నాను. ఛీ! యిలాంటి దుర్మార్గపు జీవితము నేనింక త్యాగము చేయాలి' అని భావించి, ఆనాటినుండి తన ధర్మపత్నిని తల్లిగా భావించి సంసారమును త్యాగము చేసి వైరాగ్యములో ప్రవేశించి జ్ఞానతత్త్వాన్ని అనుభవిస్తూ వచ్చాడు. కనుకనే 'యోగములో రాజయోగము' అన్నారు. రాజయోగమనగా ఏమిటి?

**ప్రతి మానవుడు తన కర్తవ్యమును నిర్వర్తించాలి**

కర్తవ్యకర్మలు నిర్వర్తించుకుంటూ తనయొక్క దివ్యభావములు విస్మరించక దైవత్వమును చింతించుచూ కాలము గడపటమే! నిత్యధర్మము నిర్వర్తించుచూ తన కర్తవ్యపాలన

srisathyasaivachanamrutam

చేసుకుంటూ జనకుడు రాజయోగమున అందరాని మోక్షము పొందెను. ఈ విధముగా ప్రతి మానవుడు తన కర్తవ్యమును నిర్వర్తించాలి. Duty is God అన్నారు. Do your duty. నీయొక్క కర్తవ్యమును నీవు నిర్వర్తించు. ఒకానొక సమయమునందు గొప్ప సభ జరుగుతున్నది. ఈ సభయందు పాండవులు, కౌరవులు, రాజులు, ద్వేషులు సర్వులు ప్రవేశించారు. ఆ నిండు కొలువులో శిశుపాలుడు, దంతవక్త్రుడు కృష్ణుని పరమ నీచంగా దూషిస్తూ వచ్చారు. అగ్రతాంబూలము కృష్ణునకు యివ్వరాదని ధర్మరాజును విమర్శిస్తూ వచ్చారు. ఈ కృష్ణునికంటే అధికుడైన గురువులు యీ సభలో లేరా? యోగులు, ఋషులు, మహా తపస్వులు, సర్వసంగ పరిత్యాగులు యీ సభలో అనేకమంది ఉంటున్నారు. అంతేకాదు ఆచార్యులు ఆచరించి అనుభవించేవారు. ద్రోణాచార్య వీరందరు ఉంటున్నారు. భీష్మాచార్యుడు యింతకంటె గొప్పవాడు కదా! యిటువంటి ఆచార్యులు ఉండినప్పుడు యీ కృష్ణునికి అగ్రతాంబూలము ఎందుకివ్వాలి?

**స్నానంబు చేయు జవరాండ్ర చీరలు**
**కాజేసినందుకా పూజ నీకు?**
**గొల్లపూబోండ్లతో జల్లులాడిననాడు**
**హర్షించినందుకా అర్ఘ్యమిడుట?**
**చాలునిక కట్టిపెట్టు పంచాంగమింక**
**పొగడుకొనబోకు చాలించు మూయినోరు**
**చాలదీ నాల్క శ్రీకృష్ణు సన్నుతింప**
**నూరు చీల్కలు చీల్తు నోరోరి భీష్మ.**

అని అనేక విధములుగా దూషిస్తూ వచ్చారు. ఈ దూషణలు ధర్మజుడు విన లేకపోయాడు. అతని మనస్సు పరిపరివిధములుగా అశాంతికి గురైంది. చూస్తూ ఉండగనే అగ్రతాంబూలము తీసుకున్న తట్టను కృష్ణుడు శిశుపాలునిపై ఒక్కతూరి విసిరాడు. చక్రము కాదు, సుదర్శనము కాదు, తట్టనే విశిరాడు. ఆ తట్ట వెళ్లి శిశుపాలుని కంఠము తీసివేసింది. దానికి సంతోషించాడు, ధర్మజుడు. కానీ మరుక్షణమునందే శిశుపాలుని రక్తము వెళ్లి కృష్ణుని పాదాలపైన పడింది. అతనియొక్క జీవనజ్యోతి కృష్ణునిలో ఐక్యమై పోయింది. ఈ దృశ్యము

srisathyasaivachanamrutam

ధర్మజునకు మరింత ఆశ్చర్యకరమైపోయింది! 'దుష్టుడు, దుర్మార్గుడు, భగవంతుని విమర్శించిన పాపి, యితనికి సాయుజ్య ముక్తి! యితని రక్తము కృష్ణునిపాదములపైన పడటం!' అని అనేక విధములుగా సందేహాలు అతనిలో వచ్చాయి. భరించలేకపోయాడు. 'నారదా! యీ ఆశ్చర్యకరమైన దృశ్యమునకు అంతరార్థము ఏమిట'ని ప్రశ్నించాడు. నారదుడు చెబుతున్నాడు: 'ధర్మజా! దూషణభూషణ తిరస్కారములన్నియుకూడను దేహమునకేగానీ ఆత్మకు కాదు. అహంకార, మమకారములు గల దేహమునే నీవు కృష్ణునిగా భావిస్తున్నావు. ఈ ఉపాధి భ్రాంతి నీకు ఉండినంతవరకు దూషణ భూషణ తిరస్కారములన్నీ బండలుగా ఉంటుంటాయి.

**ప్రేమతో భగవంతునియందు ఐక్యమైపోవడం శాశ్వతమైనది**

భగవంతుడు ఉపాధి స్వరూపుడు కాదు. భగవంతుడు నిత్యశుద్ధుడు. 'నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త, నిర్మల స్వరూపిణం'. అట్టి భగవంతునికి యీ తిరస్కార, పురస్కారములేమాత్రం చెందవు. లోకములో అనేకమంది భగవంతుని దూషణచేత ముక్తిని పొందుతూ ఉంటారు. మరికొంతమంది భూషణచేత ముక్తిని పొందుతూ ఉంటారు. ఇంకా కొంతమంది మైత్రిచేత ముక్తిని పొందుతారు. ప్రేమచేత మరొకరు ముక్తిని పొందుతారు. అయితే ప్రేమచేత పొందే వారికంటే దుష్టులే సులభంగా భగవంతుని సాయుజ్యాన్ని పొందుతున్నారు. ఏమిటి కారణం? దుష్టుడు అతిశీఘ్రంగా భగవంతునిలో ఐక్యమైపోతున్నాడు. భక్తుడు అనేక శ్రమలకు, కష్టములకు, నష్టములకు, విచారములకు, పరీక్షలకు గురియై అనేక విధాలుగా పీడింపబడి తదుపరి భగవంతునితో ఐక్యమవుతున్నాడు. దీనికీ, దానికీ ఉండిన వ్యత్యాసం ఏమిటి? పరమభక్తుడైనవాడు ప్రేమతో భగవంతునితో ఐక్యమై పోవడం శాశ్వతం. ఇది ఆనందకరమైనది. కాని దుష్టుడు, దుర్మార్గుడు అప్పటికప్పుడు భగవంతునిలో ఐక్యమై పోతున్నాడు. ఇది క్షణభంగురమైనది, ఆనంద రహితమైనది. భగవంతునిలో సర్వులూ ఐక్యమవుతున్నారు. కాని, ప్రేమచేత తనను తాను భగవంతునికి అర్పించుకున్నటువంటివాని ఐక్యము శాశ్వతమైనటువంటిది. కనుక, ఆత్మతత్త్వమును చక్కగా అర్థం చేసుకోవాలి. జగత్తులో ఎందరో దుష్టులు, దుర్మార్గులు, అనాచారులు అనేకమంది భగవంతుని స్మరిస్తూ సద్గతిని పొందినట్లుగా కన్పిస్తుంటారు.

sri sathyasai vachanamrutam

## 'మంచిని చూడు, మంచిని విను, మంచిని చేయి' అనే మూడే ధర్మసూత్రములు

పరమభక్తులైనవారు అనేక కష్టములకు, నష్టములకు గురియై పరితపించినట్లుగా కనిపిస్తుంటారు. కానీ, బాహ్య దృశ్యములు మనకు ప్రధానము కాదు. అంతర్భావములో నున్న ఆత్మతత్త్వముయొక్క రహస్యాన్ని మనం గుర్తించాలి. ఇలాంటి ఆత్మతత్త్వమును అనుగ్రహించటానికి సంకల్పించి భగవంతుడు వామన రూపము ధరించి బలిచక్రవర్తి దగ్గర చేరాడు. ఈ బలిచక్రవర్తి ఎవరు? రాక్షసరాజైన హిరణ్యకశిపుని కుమారుడు ప్రహ్లాదుడు. ప్రహ్లాదుని కుమారుడు విరోచనుడు. ఈ విరోచనుని కుమారుడు బలిచక్రవర్తి. కానీ, విరోచనుని మాటయే ఎక్కడా రాదు. 'ప్రహ్లాదుని మనుమడు' అని చెబుతున్నారే గానీ, విరోచనుని కుమారుడని ఎవ్వరూ చెప్పటం లేదు. కారణం ఏమిటి? బలిచక్రవర్తి తండ్రి విరోచనుడు మహా దుర్మార్గుడు. అలాగే ప్రహ్లాదుని తండ్రి హిరణ్యకశిపుడు రాక్షసుడే! అతను హరి ద్వేషి. కాని, బలిచక్రవర్తి హరిప్రీతుడు. అతని తండ్రియైన విరోచనుడుకూడను హరి ద్వేషి. 'హరిని స్మరించకూడదు,' అని అతడు శాసించాడు. అటువంటి స్థితియందు బలిచక్రవర్తి ధర్మరీతిగా దేశాన్ని పరిపాలించుకుంటూ వచ్చాడు. ప్రజలను తన కన్నబిడ్డలవలె విశ్వసిస్తూ వచ్చాడు. రాజు పవిత్ర హృదయుడు కావటంచేత రాజ్యమంతయు సుభిక్షంగా జరుగుతూ వచ్చింది. 'యథారాజా తథా ప్రజా.' రాజు ఎట్టివాడో ప్రజలు అట్టివారుగా ఉంటారు. కనుకనే ప్రాచీన కాలమునుండి రాజులు ధర్మమూర్తులుగా అభివృద్ధి కావాలని ప్రబోధిస్తూ వచ్చారు. మనుచక్రవర్తి ప్రబోధించిన ధర్మసూత్రములకు మూడు ప్రాణములు-ఒకటి 'భద్రం పశ్యంతి,' రెండు 'భద్రం శృణ్వంతు,' మూడు 'భద్రం కుర్వంతి.' భద్రం పశ్యంతి-మంచిని చూడు, భద్రం శృణ్వంతు-మంచిని విను, భద్రం కుర్వంతి-మంచిని చేయి. ధర్మమునకు ఈ మూడే ప్రాణములు. మనము కేవలము 'మంచిని చూడు, మంచిని విను, మంచిని చేయి' అని చెప్పినంత మాత్రమున చాలదు. చేసి చూపించాలి. యీ మూడు లేకపోయినప్పుడు ధర్మమునకు ప్రాణమే లేదు. కాన, యిటువంటి ధర్మములను ఆచరించి, అనుభవించి, ప్రజలకు అందిస్తూ వచ్చాడు బలిచక్రవర్తి. ఒకానొక సమయంలో ప్రహ్లాదుని తండ్రియైన హిరణ్యకశిపుని సోదరుడైన హిరణ్యాక్షుడు మరణించిన సమయములో వారి తల్లి ఆ కళేబరముపైన పడి చాలా దుః

sri sathyasai vahinamrutam

ఖిస్తూ ఉన్నది. ఆ సమయములో హిరణ్యకశిపుడు వెళ్లి 'తల్లీ! యీ ప్రపంచమంతయు చలిపందెరవంటిది. ప్రతి ప్రాణికూడను యీ జగత్తులోపల కర్మయాత్రికుడు. తమ తమ దాహమును తీర్చుకునే నిమిత్తమై ఇందులో ప్రవేశిస్తూ ఉంటారు. వారి దాహమును వారు తీర్చుకొని పోతూ ఉంటారు. ఆ విధముగానే వచ్చినవారము, మనంకూడను. ప్రతి ప్రాణి కర్మక్షేత్ర యాత్రికుడు. ఈ యాత్రలో మనయొక్క దాహమును తీర్చుకొని మన స్వస్థానమునకు చేరుతున్నాము. యింత మాత్రమునకు నీవు విచారించి ప్రయోజనమేమి? యింతే కాదు, హరి ద్వేషుడై నా అన్న హరిచేత చంపబడ్డాడు. అది అతని అదృష్టము. సాక్షాత్తు ఆ సృష్టికర్తయే యితనికి లయకర్తగా మారాడు. సృష్టించిన భగవంతుడే శిక్షించాడు. ఎంతటి అదృష్టవంతుడు నా అన్న' అన్నాడు. 'నాకు కూడను అట్టి ప్రాప్తియే కలగాలని ప్రార్థిస్తున్నాన'న్నాడు. తల్లి యీ మాటలు విని ఆనందించి 'తథాస్తు' అనింది. అదే విధముగనే హిరణ్యకశిపుని హరియే సంహరించి అతని మనో భీష్టమును నెరవేర్చాడు. యిది కేవలము ద్వేషముచే, విరోధముచే, క్రోధముచే దైవత్వమును అనుభవించే మార్గమునకు ఉదాహరణగా నిరూపిస్తూ వచ్చింది.

**అమనస్కునికి మాత్రమే మోక్షప్రాప్తి కలుగుతుంది**

ప్రతి మానవుడుకూడను మాష్టరు. మాష్టరు అధికారిగా ఉండాలి. ఎందుకనగా ప్రతి హృదయమునందు దైవస్వరూపుడు సాక్షాత్కరిస్తున్నాడు. ప్రతి చిత్తమునందుకూడను చిత్తచోరుడు ప్రతిష్ఠింపబడ్డాడు. కనుక 'నీవు యాచకుడుగా మారకూడదు' అనేది కూడను బలిచక్రవర్తి చరిత్రలో పవిత్రమైన ఆదర్శమునందిస్తూ వచ్చింది. బలిచక్రవర్తిని మూడడుగులు దానము కోరాడు, వామనుడు. భూలోకము, స్వర్గలోకము, యీ రెండులోకములను తన రెండు పాదములచే ఆక్రమించాడు వామనుడు. ఒక్కొక్క పాదము యింత ఘనమైన స్వరూపకంగా ఉండినప్పుడు బలిచక్రవర్తి యింత చిన్నవాడుగా రావటానికి కారణం ఏమిటి? అనగా ఎంత పెద్దవాడైనప్పటికిని యాచకత్వములో ప్రవేశించినప్పుడు తాను చిన్నవాడై పోతాడు! అనగా తాను ఇతరులముందు చేయి చాపినప్పుడు తాను చిన్నవాడైపోతాడు. ఇతరులకు యిచ్చేవాడుగా ఉన్నప్పుడు ఘనముగా ఉంటాడు. 'అణోరణీయాన్ మహతో మహీయాన్.' 'చేయి చాపేవాడు అణుస్వరూపుడు;

sri sathyasaivachanamrutam

యిచ్చేవాడు ఘనస్వరూపుడు.' బలిచక్రవర్తి ఆ సత్యమును గుర్తించుకున్నాడు. 'నేను యిచ్చేవాడను, ఇది నా ప్రాప్తి. ఎంత అదృష్టవంతుడను నేను!' అనుకున్నాడు. తన అదృష్టమును తాను కొనియాడుతూ వచ్చాడు. అయితే గురువైన శుక్రాచార్యుడు అతనికి అడ్డుపడి 'నీముందు చేయి చాపి దానము కోరేవాడు కేవలము సామాన్య బ్రాహ్మణుడు కాదు. సాక్షాత్ శ్రీమన్నారాయణమూర్తి' అన్నాడు. అప్పుడు చెప్పాడు, బలిచక్రవర్తి 'గురూజీ! దైవముకంటె గొప్ప నాకు మరొకరు లేరు. గురువునైనా నేను త్యజిస్తానుగానీ దైవమును త్యజించను. లోకములో భూమిని దానము చేసేవారు ఉన్నారు. విద్యను దానము చేసేవారున్నారు. అన్నదానము సలిపేవారున్నారు. ధనకనక వస్తువాహనాదులు దానము చేసేవారున్నారు. యీ దానములు గొప్పకాదు.' ఇలా చెప్పి వామనమూర్తికి తనను తానే దానము చేసుకున్నాడు! ఈ దానమును ఆత్మార్పణముగా భావించి బలిచక్రవర్తి తనను తాను యిచ్చుకున్నాడు.

**మదీయ ధనదారాది సర్వస్వం తే సమర్పితమ్**
**సర్వలోకైకనాథ త్వం రక్ష మాం శరణాగతమ్.**

'నా సర్వము మీదే' అని అర్పితము చేశాడు. వామనుడు మూడడుగులు నేల ఆశించి ఒక పాదముతో భూమిని, ఒక పాదముతో ఆకాశమును ఆక్రమించి, మూడవ అడుగును బలిచక్రవర్తి తలపైన పెట్టటంలో ఉండిన అంతరార్థము ఏమిటి? యావత్ ప్రపంచమును ఒక పాదముతో తొక్కినవానికి ఆ ప్రపంచములోనే బలిచక్రవర్తి ఉన్నాడు కదా! అతని తల వేరే ప్రత్యేకంగా ఎక్కడ ఉంటున్నాది? అనగా దీనికి అంతరార్థము మరొకటి ఉంటున్నది. భూరాజ్యము, స్వర్గరాజ్యము అంతేకాక మనోరాజ్యమునుకూడా ఆక్రమించాడని అర్థము. కనుక, బలిచక్రవర్తినుండి మనోరాజ్యమును స్వీకరించినవాడు, వామనుడు. మనస్సే యీ జగత్తుకంతా మూలకారణము. 'మనఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' ఆ మనస్సును స్వాధీనము చేసుకోవాలి. అప్పుడే అమనస్కుడైపోతాడు. అమనస్కునికి మాత్రమే మోక్షప్రాప్తి. ఈవిధంగా వామనుడు బలిచక్రవర్తికి మోక్షమునందించాడు. ఆతని మనోరాజ్యమునుకూడ తాను ఆక్రమించాడు.

srisathyasaivachanamrutam

**రాజుకు తగిన ప్రజలు, ప్రజలకు తగిన రాజు యిరువురు కూడినప్పుడే పూర్ణత్వము చేకూరుతుంది!**

వామనుడు కేవలము దానమునడగటానికి రాలేదు. బలిచక్రవర్తిని తరింపచేయటానికి వచ్చాడు. బలిచక్రవర్తిని రక్షించటానికి వచ్చాడు. బలిచక్రవర్తిని ఆదర్శపురుషునిగా రూపొందింపచేసే నిమిత్తము వచ్చాడు. కారణం ఏమిటి? బలిచక్రవర్తి ధర్మమూర్తి, న్యాయమూర్తి. ప్రజా పరిపాలనయందు ఆదర్శమూర్తి. అంతమాత్రమే కాదు. దానధర్మాదులందు, దైవభక్తియందు, మంచి ఉన్నతమైన హృదయము గలవాడు. చలించని మనస్సు, భ్రమించని దృష్టి కలిగినవాడు, బలిచక్రవర్తి. ఎట్టి పరిస్థితియందు అతని మనస్సు చలించే స్వభావము కలది కాదు. గొప్ప స్థిరచిత్తుడు, బలిచక్రవర్తి. అట్టి స్థిరచిత్తుడైన బలిచక్రవర్తిని అనుగ్రహించే నిమిత్తమై వామనుడు అవతరించి లోకమునకు ఆదర్శవంతమైన మార్గాన్ని అందిస్తూ వచ్చాడు. అప్పుడు బలిచక్రవర్తి వామనుని కోరుతున్నాడు. 'స్వామి! నా గుణగణములు మాత్రమే ప్రధానము కాదు. నా ప్రజలయొక్క భక్తిప్రపత్తులుకూడను అత్యంత అవసరము. నా ప్రజలు మంచివారు కావటంవలన కదా, నేను బాగా పాలించగలిగాను! రాజుకు తగిన ప్రజలు, ప్రజలకు తగిన రాజు యిరువురు చేరినప్పుడే పూర్ణత్వము చేకూరుతుంది. ఎట్లనగా

> **వానలు వచ్చెనంచు భువి పండునే విత్తులు నాటకున్న ఆ**
> **వానలు రానిచో ఫలము వచ్చునె బీజము నాటియున్ననెం**
> **దైనను రెండు కూడిన మహత్తర సిద్ధి లభించు సుమ్మి దై**
> **వాను గతిన్ లభించు పురుషార్థ విధానము మేలునిచ్చుటన్.**

ప్రజల మనోభావము, ప్రభువుయొక్క పరిపాలనా విధానము, రెండుకూడను నెగెటివ్, పోజిటివ్‌లాగ చేరినప్పుడే ఫలసిద్ధి కలుగుతుంది. కనుక శ్రీమన్నారాయణమూర్తి నాకు మాత్రమే మోక్షమిచ్చి ప్రయోజనము లేదు. నన్ను యింతటివాడుగా చేసినవారు ప్రజలు; నా ప్రజలనుకూడను అనుగ్రహించమ'ని కోరాడు. 'ప్రతి సంవత్సరము నా ప్రజలను నేను చూచి ఆనందించే అవకాశము యివ్వమ'ని కోరాడు. 'శ్రావణమాసము, శ్రవణ నక్షత్రము,

sri sathyasai vachanamrutam

శనివారమునందు నేను కేరళ ప్రజలను వచ్చి దర్శిస్తాన'ని కోరుకున్నాడు. దానికి వామనమూర్తి అనుగ్రహించాడు. కనుకనే అప్పటినుండి కేరళప్రజలందరు బలిచక్రవర్తి మన రాజ్యమునందు ఆవిర్భవించాడు అనే విశ్వాసముచేత యీ 'ఓణం' అనే పండుగ చేసుకుంటున్నారు. ఐతే యీ 'ఓణం'లో మరో అంతరార్థము ఉంటున్నాది. 'ఓణం' అనగా ఏమిటి? నూతన వస్త్రములు ధరించటమా? నూతన వస్త్రములు ధరించినంత మాత్రమున ఓణం అవుతుందా? వస్త్రమనగా హృదయానికి అర్థము. నూతన వస్త్రములు ధరించటమనగా పాతవి, రోతవి దూరము చేసి నూతనమైన, భవ్యమైన, నవ్యమైన హృదయాన్ని ధరించటమే! ఓణంనాడు వారి వారి గృహములంతా పరిశుద్ధము చేసుకొని పచ్చని ఆకులతో తోరణములు కట్టి అరటి చెట్లను కట్టి అనేక విధములుగా అలంకారములు చేస్తూ ఉంటారు. దీని అంతరార్థము ఏమిటి?

**బాహ్యమైన గృహమును, అంతరంగమైన హృదయమును పరిశుద్ధము గావించుకొని, నిర్మల, నిశ్చల, నిస్వార్థ హృదయముతో జీవించడమే ఓణం పండుగ అంతరార్థము**

భగవంతుడు 'అంతర్బహిశ్చతత్సర్వమ్ వ్యాప్య నారాయణస్థితః' లోపల వెలుపల ఉంటున్నాడు, భగవంతుడు. కనుక బాహ్యమైన గృహమును పరిశుద్ధము చేసి అంతర్ హృదయమునుకూడను పరిశుద్ధముగావించుకొని, నిర్మల, నిశ్చల, నిస్వార్థమైన హృదయముతో ఉండటమే యీ పండుగకు సరైన అర్థము. యింతేకాక వైజ్ఞానికముగా మరొక అర్థముకూడా ఉంటున్నాది. పూర్వము కేరళలోపల యిండ్లు తలుపులు కిటికీలు లేకుండా, గాలి వచ్చి పోయేందుకు లేక, చాలా యిరుకుగా ఉండేవి. కేరళదేశములో వర్షములు అధికముగా కురిసేవి. అందువల్ల వేడి కలిగే నిమిత్తమై ద్వారములు చిన్నవిగా పెట్టుకొని, కిటికీలు తక్కువగా పెట్టుకొని నిర్మించుకునేవారు. ఈ పండుగ దినములందు యింటికి పచ్చని మామిడిఆకుల తోరణములు కట్టుకొని, టెంకాయ లేతఆకులను అలంకారముగా అల్లుకొని, అరటి చెట్లను కట్టుకొని అనేక విధములుగా అలంకారములు చేసేవారు. ఇది కేవలము బాహ్యమైన అలంకారమే కాకుండా వైజ్ఞానికమైన ఫలితముకూడా అందులో ఉంటున్నాది. ఏమిటా ఫలితము? మానవుడు వదిలే బొగ్గుపులుసు వాయువును యీ పచ్చని ఆకులు తీసుకుంటాయి. పచ్చని ఆకులు తాము వదిలే ప్రాణవాయువును

sri sathyasai vachanamrutam

మనుషులకందిస్తాయి. దానివలన రోగములు లేకుండా ఉంటాయి. ఈ వైజ్ఞానికమైన అర్థం ప్రాచీనుల సంస్కృతియందు యిమిడి ఉంటున్నది. యింటి ముందు పేడను నీళ్లతో కలిపి చల్లుకొని ముగ్గులు వేసుకునేవారు. దీనియొక్క అంతరార్థము ఏమిటి? మన గృహముచుట్టూ ఆశుభ్రముగా ఉంటుండాది. మురికి ఉండటంచేత పురుగులు చేరుతూ ఉంటాయి. దానివలన రోగములు అభివృద్ధి అవుతూ ఉంటాయి ఈ పేడనీరు చల్లటంచేత అది పురుగులను చంపివేస్తుంది. యిదికూడను వైజ్ఞానికంగా ఉపకారం చేస్తూ వచ్చింది. యింక యింటిలో భుజించే ఆహారములు ఎలాంటివి? మధురమైన పదార్థములు చేసుకుంటారు, పర్వదినములలో. అందులో కేరళ ప్రజలు అరటిపండ్లుతో అనేక పాయసములు చేసుకుంటారు. ఈ అరటిపండులోపల ఒక విధమైన శక్తి ఉంటుండాది. కొంతమంది సైంటిస్టులు ఒప్పుకోరుగానీ, దీంట్లో ఒక విధమైన కరెంటు ఉంటుండాది. అరటిపండ్లతో చేసిన పాయసము భుజించటముచేత జఠరాగ్నిలోపల ఉన్న దోషములంతా చల్లారిపోతాయి. యిది వైజ్ఞానికంగా ఉండే అంతరార్థము. యింక పారమార్థికముగా ఉండే అంతరార్థము ఏమిటి? భగవంతుడు మధురస్వరూపుడు. 'నయనం మధురం, వచనం మధురం, సర్వం మధురం. మధురాధిపతే మధురం మధురం'. భగవంతునికి 'మధురస్వరూపుడ'నే పేరు పెట్టాం! కృష్ణుడు మథురలోనే పుట్టాడు. మథుర అనగా కేవలం ఒక పట్టణముకాదని, మధురమైన స్థాయిలో ఉంటాడని, యిలాంటి అంతరార్థమును పురస్కరించుకొని పండుగలలో మాధుర్యముతో నిండిన పదార్థములు భుజించటము. దీనివల్ల మన భావములలో మధురమైన భావాలు రావాలి. దుష్టభావములుగానీ, దురాలోచనలు గానీ, మనలో యేమాత్రము ఆవిర్భవించకూడదు. బలిచక్రవర్తియొక్క సంస్కారములు అనేక విధములుగా కేరళరాజ్యములో ప్రచార ప్రబోధలు సలుపుతూ వచ్చారు.

**వంశములు, కులములు ప్రధానము కాదు; భావములు చాలా ప్రధానము**

బలిచక్రవర్తి ప్రజలలో దివ్యభావములు నెలకొలిపి వారికి పవిత్రమైన మార్గములు ప్రబోధించే నిమిత్తమై రాక్షసవంశములో జన్మించాడు. అతని వంశము రాక్షశవంశమేగానీ,

sri sathyasai vahanamrutam

భావము దైవభావమే! వంశములు, కులములు మనకు ప్రధానము కాదు. భావములు చాలా ప్రధానము. భావమునందే సర్వముకూడను లీనమైపోతుంటాయి. కనుక, మనమందరము ప్రకృతి భావమును త్యజించాలి, పరమాత్మ భావమును స్వీకరించాలి. యిదియే ఏకత్వముతో ఉండిన అద్వైత జ్ఞానము. 'ఒకవైపున ప్రకృతి, ఒకవైపున పరమాత్మ' అని రెండు భావములుగా పెట్టుకుంటే A man with a dual mind is half blind అని, రెండు భావములు ఉండటంచేత మానవులు అంధకారములో పడిపోతున్నారు. రెండు భావములు ఉండకూడదు, ఒకే భావము ఉండాలి! 'విశ్వం విష్ణుమయం'-సర్వం బ్రహ్మమయం. ఈ జగత్తులో బ్రహ్మకానిది ఒక్కటీ లేదు! ఐతే మన ఉపాధి భేదముచేత, ఉపాధి భ్రాంతులచేత, మమకార, అహంకారములచేత, దూషణ, భూషణ, తిరస్కారములకు గురైపోతున్నాము. భగవంతునికి యివేమీ పట్టవు. ఆయన వీటన్నిటికి అతీతుడు. గట్టిగా దూషిస్తే గాలిలో చేరిపోతుంది. మెత్తగా దూషిస్తే తనకే తగులుతుంది. మనము ఎందుకింక భయపడాలి? మనము ఎందుకు ఉద్రేకపడాలి? దూషణ, భూషణ, తిరస్కారములకు ఎందుకు గురికావాలి? ఎవరు తిన్నది వారికే త్రేపు వస్తుంది. ఏమి తింటే అదే త్రేపు వస్తుంది. 'యద్భావం తద్భవతి.' యిట్టి సత్యమును గుర్తించే వ్యక్తులుగానీ, బోధించే వ్యక్తులుగానీ లేకపోవటంచేత సత్యాన్ని అర్థము చేసుకోలేకపోతున్నారు, సద్భక్తులు. బాహ్యార్థములందే కూలిపోతున్నారు. బాహ్యాచారములందే మునిగిపోతున్నారు.

**భగవంతునికి హృదయశుద్ధి మాత్రమే కావాలి**

భగవంతుడు బాహ్యాచారములు ఏమాత్రము ఆశించడు! నీ తృప్తి నిమిత్తమై నీవు పూజలు చేస్తుంటావు. భగవంతునికి హృదయశుద్ధి మాత్రమే కావాలి. అందువల్లనే తిరుత్తొండాళ్వారు 'చిత్తశుద్ధివోడు వున్నవై పూజసేదనే శిఘ్రమ ఒందురివ రామ రామ' అన్నాడు. 'చిత్తశుద్ధితో నేను పూజ చేస్తున్నాను' అన్నాడు. ఈ విధమైన చిత్తశుద్ధిచేత మనం భగవంతునికి పూజ చెయ్యాలి. చిత్తశుద్ధి లేక ఎన్ని పూజలు చేసి, ఎన్ని విధములైన సత్కర్మలలో ప్రవేశించినా ప్రయోజనము లేదు. దానధర్మాలు చేస్తున్నాము. యజ్ఞయాగాది క్రతువులు ఆచరిస్తున్నాము. జపధ్యానాదులు చేస్తున్నాము. కానీ, మన దుర్గుణములు

srisathyasaivachanamrutam

పోవటం లేదు! 'ఆధ్యాత్మికము' అంటే ఏమి అర్థము? ఆత్మతత్త్వమే ఆధ్యాత్మికము. ఆ ఆత్మతత్త్వమును మనం గుర్తించాలి. కనుక ఆధ్యాత్మికమనగా ఏమిటి? మనలో ఉన్న రాక్షసత్వము, పశుత్వము దూరము గావించుకొని దివ్యత్వాన్ని మనము ప్రత్యక్షింపచేసుకోటమే నిజమైన ఆధ్యాత్మికము. మనము పశుత్వమును దూరం చేసుకోవాలి. అది నిజమైన ఆధ్యాత్మికము. ఎన్ని పూజలు చేసినా మనలో పశుత్వము దినదినమునకు పెరిగిపోతున్నాదేగానీ, తరిగిపోవటం లేదు. మనలో క్రోధము, ద్వేషము ఉప్పొంగిపోతున్నాయి. భగవంతునికి ప్రార్థన చేసి కట్టకడపటికి 'శాంతి, శాంతి, శాంతి' అనే సమయములోకూడా ద్వేషము కనుపించుతుంది. అక్కడకూడా వస్తుంది, నీకు క్రోధము. యింక శాంతి పలికి ప్రయోజనము ఏమిటి? నీలోనే శాంతి లేదు; పదములలో శాంతి వస్తుందా? మూడు పర్యాయములు 'శాంతి, శాంతి, శాంతి' అని చెప్పటంలో అంతరార్థము ఏమిటి? ఆది భౌతికము, ఆది దైవికము, ఆధ్యాత్మికము, ఈ మూడింటియందు మనకు శాంతి కావాలి. శారీరక శాంతి, మానసిక శాంతి, ఆధ్యాత్మికశాంతి, యీ మూడింటికోసమనే 'శాంతి, శాంతి, శాంతి' అని చెప్పడం. యీ మూడింటి శాంతి మనకు రావాలి. ఈనాడు మనకు దేహశాంతి ఉంటే మనోశాంతి లేదు, మనోశాంతి ఉంటే ఆధ్యాత్మికశాంతి లేదు. ఏమి ప్రయోజనము? విశ్రాంతి మందిరాలు దండిగా కట్టుకుంటున్నారు, ప్రజలు. కానీ మానసిక శాంతి మందిరము కట్టడం లేదు.

**మహాపురుషులయొక్క పవిత్రగుణములను ఒకటి, రెండైనా మనలో ప్రవేశపెట్టి ఆచరణలో నిరూపించటమే పర్వదినములయొక్క నిజమైన అంతరార్థము**

మనోశాంతి ప్రధానము. ఆ మనోశాంతి త్యాగముచేతనే మనకు లభ్యమవుతుంది. ఇందుకొరకు అహంకార, మమకారములు అణగత్రొక్కాలి. ఆ విధంగా అణగత్రొక్కిన మహా చక్రవర్తి, బలిచక్రవర్తి. బలిచక్రవర్తిని మనం పూజిస్తున్నాము. బలిచక్రవర్తి 'మహారాజు' అని, అతనిని మనము ఆరాధిస్తున్నాము. కానీ బలిచక్రవర్తి గుణములు మనం ఏమి

sri sathyasaivachanamrutam

పెంచుకుంటున్నాం? బలిచక్రవర్తి గుణములను మనం పెంచుకోవాలి. బలిచక్రవర్తి నిరూపించిన దానధర్మములు మనం పెంచుకోవాలి. బలిచక్రవర్తివలె భగవంతునకు మనము అర్పితము కావాలి. చాలామంది 'రాం, రాం' అని జపము చేస్తుంటారు. ఈ రామభక్తులు, రాముని గుణములను ఎంతవరకు ఆచరిస్తున్నారు? రాముని మొట్టమొదటి ధర్మము పితృవాక్యపరిపాలన! ఈ రోజుల్లో తండ్రి ఆజ్ఞప్రకారం ఎవరు నడుచుకుంటున్నారు? భ్రాతృప్రేమ రామునియందు అధికముగా ఉండేది. ఈనాడు సోదరులు ఎంతవరకు అన్యోన్యంగా ఉంటున్నారు. ఒకరినొకరు ప్రేమిస్తున్నారా? ఒకరిమీద ఒకరు ద్వేషాసూయలతో సుప్రీంకోర్టువరకు పోతున్నారు. యిదా రాముడు చూపించిన ధర్మము? రామభక్తుడు అనేవాడు రామునియొక్క గుణములు ఒకటి రెండైనా ఆచరించటానికి ప్రయత్నించాలి. కృష్ణభక్తులు కృష్ణవాక్యములను ఒకటి రెండైనా ఆచరించాలి. బలిచక్రవర్తియొక్క సాధకులు అనుకున్నప్పుడు బలిచక్రవర్తి భావములు ఒకటి రెండైనా అనుభవించాలి. అప్పుడే యీ ఓణములో ఉండిన పవిత్రమైన శక్తి మనలో ప్రవేశిస్తుంది. ఈనాడు కేవలము మహాపురుషుల పుట్టినరోజులు మాత్రం చేసుకుంటున్నాము. యీ పుట్టినరోజులయొక్క ఫలితము ఏమిటి? పాయసం, పరమాన్నము నింపుకోటం! యిది కాదు, నిజమైన పుట్టినరోజులు. వారియొక్క గుణములను మనలో ప్రవేశపెట్టుకోవాలి. వారి గుణములను మనలో పుట్టించుకోవాలి. అదీ పర్వదినములయొక్క నిజమైన అంతరార్థము.

**రాకపోకలులేని తత్త్వమే నిజమైన ఆస్తికత్వము**

దివ్యాత్మస్వరూపులారా! ప్రాచీనకాలమునుండి కేరళరాజ్యములో ప్రజలు వారి వారి సాంప్రదాయములు వారు వదలక వారి వారి ఆచారములను వారు ఆచరిస్తూ ఎలాంటి బాహ్యమైన ఒడిదుడుకులు అభివృద్ధియైనప్పటికిని మొత్తము మూడు భాగములు తమ సాంప్రదాయమును అనుసరిస్తూనే వస్తున్నారు. పూర్వము చెప్పేవారు, కేరళ రాష్ట్రము కమ్యూనిష్టు రాజ్యము, నాస్తిక రాజ్యమని. కాదు కాదు, అది ఆస్తికరాజ్యము. ఏదో రాజకీయ తంత్రములలో అనేక రకములైన ఆటలు ఆడుతున్నారేగానీ అది నిజము కాదు. యిది

sri sathyasai vahanamrutam

కేవలము రాజకీయపరమైన ఆట! కేరళప్రజలు అందరిలో దివ్యభావాలు ఉంటున్నాయి. అవి లేనివారు ఎవ్వరూ లేరు. ఒక చిన్న ఉదాహరణము. పూర్వము నంబూద్రిపాద్ అనే అతడు ఉండేవాడు. ఆయన ముఖ్యమంత్రిగా ఉండేవాడు. ఆయన కమ్యూనిష్టు లీడరు. కానీ, తాను ఉపనిషత్తులంతా తర్జుమా చేశాడు. లోపల ఆ భావము ఉంటున్నాది. ప్రతివానియందు దైవభావము ఆవిర్భవిస్తూ ఉంటుంది. ఈ నాస్తికభావాలన్నీ కదలిపోయే మేఘములే! వస్తుంటాయి, పోతుంటాయి. కానీ, హృదయభావము వచ్చేది, పోయేది కాదు. రాకపోకలు లేని తత్త్వమే నిజమైన ఆస్తికత్వము. కేరళవాసులు చాలా అదృష్టవంతులు. కేరళలోపలనే మూడు అవతారాలు వచ్చాయి. వారి భక్తి ప్రపత్తులుకూడా చాలా గొప్పవి. వారి హృదయములు సున్నితమైనవి. కఠినములో కఠినములేగానీ, మెత్తదనములో చాలా మెత్తదనము. ఏదైనా దైవసంబంధమైన మాటలు మాట్లాడినప్పుడు తక్షణమే వారు కంటిధారలు కారుస్తారు. అంతటి చల్లని హృదయాలు వారివి. కనుక ఇటువంటి హృదయాలు, యిలాంటి ప్రాప్తి లభించినందుకు మీరు అదృష్టవంతులుగా ఉండి, భక్తిప్రపత్తులను దినదినాభివృద్ధి గావించుకొని, సరైన మార్గములో దీనిని ప్రవేశపెట్టాలని నేను ఆశిస్తున్నాను. కేరళ వారికి కృష్ణ భక్తి జాస్తి! ఆ కృష్ణతత్త్వములోకూడను బాలకృష్ణుడంటే మరింత యిష్టము, వారికి! గురువాయూర్ కృష్ణుడు వారికి చాలా ప్రీతికరమైనవాడు. ఈ కృష్ణతత్త్వములో ఉండిన విశేషము ఏమిటి? ఈ కృష్ణతృష్ణయే కేరళవారికి సరియైన తృష్ణ. కాన, కృష్ణ భావమును అనుభవించేవారు తమ భావములను మధురభావములుగా మార్చుకొని, దివ్యమైన తేజస్సుతో దివ్యానందమును పొంది, యావత్ ప్రపంచానికి దానిని చాటాలని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ, నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 09-09-1992న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahini amrutam